


# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక :188 | శుక్రవారం 11 జులై 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## కాంగ్రెస్ తోనే అన్ని వర్గాలకు న్యాయం

- పకడ్బందీగా సంస్థాగత నియామకాలు
- యువకులకూ ప్రాధాన్యత కల్పిస్తాం
- సిడబ్ల్యుసి ఆహ్వానితులు చల్లా వంశీ చంద్ రెడ్డి

ఖమ్మం బ్యూరో, 10 జులై (కెరటం న్యూస్):



## భద్రాద్రి ఈవో రమాదేవిపై దాడి హేయమైన చర్య

### టీబీసీయూఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సీతారామ్, శ్రీనివాసరావు





**ఖమ్మం బ్యూరో, 10 జులై (కెరటం న్యూస్):** భద్రాద్రి రామాలయ భూములు పురుషోత్తపట్నం (ఏపీ)లో కబ్జాకు గురవుతుండగా అడ్డుకున్న ఈవో రమాదేవిపై జరిగిన దాడిని తెలంగాణ బి సి ఉద్యోగుల సంఘం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు వంగర సీతారామ్, ప్రధాన కార్యదర్శి గజ్జెల్లి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన నింధితులను గుర్తించి వెంటనే అరెస్టు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈవో రమాదేవిపై జరిగిన దాడిని తెలంగాణ ఉద్యోగులపై జరిగిన దాడేనని తెలంగాణ బి సి ఉద్యోగుల సంఘం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు వంగర సీతారామ్, ప్రధాన కార్యదర్శి గజ్జెల్లి శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామికి చెందిన పురుషోత్తపట్నంలో ఉన్న భూమిలో అనుమతి లేకుండా భవన నిర్మాణ పనులు చేపడుతుండటంతో భద్రాచలం టెంపుల్ సిబ్బంది దాన్ని అడ్డుకునే క్రమంలో ఈవో రమాదేవిపై దాడి జరిగిందన్నారు. ఈదాడిపై ఏపీ ప్రభుత్వం కూడా తీవ్రంగా పరిణించాలని కోరారు.

## కసాయి కొడుకు, బిడ్డ అనే వార్తలే..

### వాటిని చూస్తే ప్రాణం కలుక్కుమంటోంది:


### ఈటల హాట్ కామెంట్స్



**న్యూస్ డెస్క్, 10 జులై (కెరటం న్యూస్):** గురుపూజోత్సవం సందర్భంగా సమాజం జరుగుతున్న అనేక సంఘటనల గురించి తనదైన శైలిలో బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. గురువారం మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఆనాడు ఈ కార్పొరేట్ స్కూల్స్ లేవని, ఆశ్రమాల్లో చదువులు ఉండేవన్నారు. నేడు గురువు అంటే గౌరవం లేదని, గురువులకే పంగనామాలు పెట్టేవారు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్లో.. సంపాదన కంటే విలువలను గొప్పగా భావించే ఈ సమాజంలో ఇప్పుడు డబ్బు, ఆస్తులే కేంద్ర బిందువు అయ్యాయని పేర్కొన్నారు.

## మందుబాబులకు బిగ్‌షాక్..

- బోనాల సందర్భంగా సికింద్రాబాద్‌లో రెండు రోజులు మద్యం షాపులు మూసివేత
- 13 నుంచి 15వ తేదీ వరకు మద్యం బంద్
- భక్తుల రక్షణకు ముందస్తు చర్యలు చేపట్టిన పోలీసులు





## బీసీలకు 42% రిజర్వేషన్లకు మంత్రివర్గ ఆమోదం

- పంచాయతీరాజ్ చట్టం-2018 సవరణలకు మంత్రివర్గ గ్రీన్ సిగ్నల్
- పెండింగ్ ప్రాజెక్టులకు భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కేబినెట్ తీర్మానం
- రాష్ట్రంలో 22,000 పైగా కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు త్వరలో
- ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమీక్షకు ఆర్థిక శాఖకు ఆదేశాలు
- AMITY, సెయింట్ మేరీ ప్రైవేట్ యూనివర్సిటీలకు కేబినెట్ ఆమోదం
- 50% అడ్మిషన్లు స్థానికులకు కల్పించాలి: AMITY యూనివర్సిటీపై నిబంధన
- జిన్నారం, ఇంద్రీశం మున్సిపాలిటీల ఏర్పాటుకు సంబంధిత గ్రామాల డీ లిస్టింగ్‌కు ఆమోదం
- అధునాతన గోశాలల ఏర్పాటుకు ముగ్గురు సభ్యుల కమిటీ - రెండు నెలల్లో నివేదిక

**న్యూస్ డెస్క్, 10 జులై (కెరటం న్యూస్):** రాష్ట్రంలో సగం జనాభాకు మించి ఉన్న బీసీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశం మరో శుభవార్తను ప్రకటించింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మార్చి నెలలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను ప్రభుత్వం ఆమోదించింది. విద్యా ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ ప్రాతినిధ్యం కల్పించే రెండు బిల్లులను అదే రోజు అసెంబ్లీలో ఆమోదించింది. ఇటీవలే పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన అంశంపై హైకోర్టు కూడా నెలాఖరులోపు రిజర్వేషన్స్ ఖరారు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

వీటన్నింటినీ చర్చించిన మంత్రివర్గం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే బీసీ డెడికేటేడ్ కమిషన్‌ను నియమించింది. రాష్ట్ర ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో కులగణన చేపట్టింది. వీటి ఆధారంగానే అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించింది

## బీజేపీ అసమర్ధ పాలన వల్లే ప్రమాదాలు: మల్లికార్జున ఖర్గే



**న్యూస్ డెస్క్, 10 జులై (కెరటం న్యూస్):** కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వం, బీజేపీపై తీస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీలో నెలకొన్న నాయకత్వ లోపం, అసమర్థ పాలన వల్లనే అన్ని రకాలుగా అవినీతి పెరిగిపోయిందని విమర్శించారు. పాలనలో ఉదాసీనత పెరిగిపోవడం మూలంగానే గుజరాత్‌లో వంతెన కూలడం, అంతకుముందు అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం వంటి విషాద ఘటనలు జరుగుతున్నాయని అన్నారు.

## ఆంధ్ర - తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్ళీ తెర మీదకు తెచ్చేందుకు కుట్ర : ఎంపీ చామల



**న్యూస్ డెస్క్, 10 జులై (కెరటం న్యూస్):** హరీష్ రావు, కేటీఆర్ మళ్లీ తెలంగాణ సెంటిమెంటును రగిలించే ప్రయత్నం చేస్తున్నారని, కాబట్టి ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. భువనగిరి జిల్లా కేంద్రంలో గురువారం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

## అందరితో కలిస్తేనే రాజకీయాల్లో పనికి వస్తారు



**న్యూస్ డెస్క్, 10 జులై (కెరటం న్యూస్):** చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కొందరు నాయకులు మాంసం తినేవారితో, మందు తాగేవారితో కలవరని, అలాంటి వాళ్లతో పార్టీకి నష్టమే తప్ప లాభం లేదన్నారు. చెత్తా చెదారంతో కలిస్తేనే రాజకీయాల్లోకి పనికొస్తారని చెప్పుకొచ్చారు. కొంతమంది మంచితనంతో పార్టీకి నష్టం జరుగుతుందని అన్నారు. గురువారం నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ ఒక సైద్ధాంతిక పార్టీ అన్నారు. గుండెల్లో జాతీయవాదం ఉన్న వారు టీ కూడా తాగరని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నోళ్లకు ఇది కరెక్ట్ కాదన్నారు.

## నాపై అర్బన్ నక్సలైట్ ముద్ర వేశారు..

### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్



## తెలంగాణ బీజేపీ రాష్ట్ర నేతలతో డా.జీవీ భేటీ



**ఖమ్మం బ్యూరో, 10 జులై (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షులు ఎన్. రామచందర్ రావుని గురువారం డాక్టర్ జి. వెంకటేశ్వర్లు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మరియు మోతుకూరి నారాయణరావు, సేవాభారతి అధ్యక్షులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన పదవికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, అలాగే, ఖమ్మం జిల్లా ప్రజల డిమాండ్లలో భాగంగా, కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు, గ్రీన్‌వే హైవే మరియు అమరావతి హైవే పనులు వేగంగా ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ఖమ్మం జిల్లా అభివృద్ధికి, ఆర్థిక ప్రగతికి ఎంతో మేలు జరుగుతుందని వారు తెలిపారు. బీజేపీ నూతన అధ్యక్షుడు పరిపూర్ణ సహకారాన్ని అందిస్తూ, ఖమ్మం జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

## బీజేపీ నేతలు క్షమాపణ చెప్పాలి



**న్యూస్ డెస్క్, 10 జులై (కెరటం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షులు మాధవ్, ఏపీ మంత్రి లోకేశ్‌కు ఇచ్చిన భారత చిత్రపటంలో తెలంగాణ లేకపోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భారతదేశ చిత్రపటం నుంచి తెలంగాణను తొలగించడంపై వెంటనే బీజేపీ నేతలు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ అస్తిత్వాన్ని భౌగోళిక గుర్తింపుని గుర్తించకపోవడం బిజెపి అధికారిక విధానమా..? అని ప్రధాని నరేంద్ర మోదీని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. ఈ విషయంలో నరేంద్ర మోదీకి పలు ప్రశ్నలు సంధించారు కేటీఆర్. దశాబ్దాలపాటు తెలంగాణ సాంస్కృతిక గుర్తింపు కోసం, చరిత్రలో తమకు సరైన చోటు దక్కడం కోసం, ప్రత్యేక భౌగోళిక గుర్తింపు, ప్రత్యేక రాష్ట్రం కోసం ఎనలేని పోరాటాలు చేసింది తెలంగాణ గడ్డ అని కేటీఆర్ పేర్కొన్నారు.

# కాంగ్రెస్ తోనే అన్ని వర్గాలకు న్యాయం

**● పకడ్బందీగా సంస్థాగత నియామకాలు ● యువకులకూ ప్రాధాన్యత కల్పిస్తాం ● సిడబ్ల్యూసి ఆహ్వానితులు చల్లా వంశీ చంద్ రెడ్డి**



**ఖమ్మం బ్యూరో, 10 జులై (కెరటం న్యూస్):** కాంగ్రెస్ తోనే అన్ని వర్గాలకు న్యాయం చేకూరుతుందని అందరికీ సమన్యాయమే కాంగ్రెస్ ప్రధాన సిద్ధాంతమని సిడబ్ల్యూసి శాశ్వత ఆహ్వానితులు, మాజీ ఏఐసీసీ కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ అధ్యక్షతన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సూచన మేరకు ప్రతి పోలింగ్ బూత్లో కాంగ్రెస్ పార్టీ కమిటీలను ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. పోలింగ్ స్థాయిలో పోలింగ్ బూత్ కమిటీ, గ్రామ శాఖ, మండల శాఖ,జిల్లా శాఖ అన్ని స్థాయిలలో కమిటీలు ఏర్పాటు చేసుకొని ఈ కమిటీలను బలోపేతం చేయబోతున్నామని అన్నారు. అందుకు గాను 2025 సంవత్సరాన్ని సంస్థాగత సంవత్సరంగా అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నిర్ణయం తీసుకోవడం జరిగిందని అన్నారు. దానిలో భాగంగా గుజరాత్ ను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోని పూర్తి చేయడం జరిగింది అని అన్నారు .ప్రతి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నియామకం కోసం స్వయంగా రాహుల్ గాంధీ గుజరాత్ వెళ్లి ప్రతి జిల్లాకు ఒక సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మాజీ ముఖ్యమంత్రి స్థాయి వాళ్లను కూడా ప్రతి జిల్లాకి ఒకరని పంపించి అక్కడ ఉన్నటువంటి కార్యకర్తలతోటి నాయకులతోటి ప్రతి ఒక్కరితో మాట్లాడి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను నియమించడం జరిగింది అని అన్నారు. నాతోపాటు ఇంకా 9 మందిని ప్రతి ఒక్కరిని ఒక్కొక్క ఉమ్మడి జిల్లాకు వ్యవహారాలను చూడడానికి మండల కమిటీలు మండల అధ్యక్షులు జిల్లా కాంగ్రెస్ కమిటీలను ఆ నియామకాలని పర్యవేక్షించడానికి తనను కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లాకి ఇన్చార్జిగా నన్ను పంపించడం జరిగిందని అన్నారు.

వివిధ కార్పోరేషన్లు వివిధ గవర్నమెంట్ డైరెక్టర్లు మెంబర్లకు సంబంధించినటువంటి నియామకాలు రాష్ట్ర స్థాయిలో పూర్తి చేయడానికి ఈ జిల్లా నుంచి ప్రతిపాదనలు 12వ తారీకు వరకు పిసిసి అధ్యక్షులకు పంపించాలని తెలిపారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ముఖ్యమైన నాయకులతో చర్చించి కాంగ్రెస్ పార్టీ కోసం ఎవరైతే కష్టపడి పనిచేస్తున్నారు. మొన్న జరిగినటువంటి శాసనసభ ఎన్నికల్లో మొన్న జరిగినటువంటి పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరెవరు ఎంత ప్రభావం చూపించగలిగినారు ఎవరు కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో ఉపయోగపడ్డారు కాంగ్రెస్ పార్టీకి ఎప్పటినుంచి సేవ చేస్తున్నారు అనేది చర్చించి ప్రతి నియోజకవర్గం నుండి రెండు పేర్లకు తగ్గకుండా ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని అన్నారు. మండల,జిల్లా స్థాయి కమిటీలకు సంబంధించి 15వ తారీకు లోపు ప్రతిపాదనలు పంపించడం జరుగుతుందని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఇవాళ అధికారంలో ఉందంటే దానికి ముఖ్య కారణం ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకుడు,కార్యకర్త కష్టమే అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వల్ల కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉందనీ, మరి ముఖ్యంగా గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ జెండా పట్టుకొని గ్రామస్థాయిలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 10 సంవత్సరాలు టిఆర్ఎస్ పెట్టినటువంటి కష్టాలను ఓర్చుకొని దేనికి అదరకుండా బెదరకుండా కష్టపడి గ్రామస్థాయి కార్యకర్తల వల్ల కాంగ్రెస్ పార్టీలో అధికార%శీ% లో ఉందని వారిని గౌరవించుకునే బాధ్యత ఉందని అన్నారు. అంతేకాకుండా జిల్లా కాంగ్రెస్ కమిటీ, నగర కాంగ్రెస్ కమిటీ, భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఏవైతే ఉన్నాయో వాటిని పూర్తిగా సమీక్షించి నూతన జిల్లా కాంగ్రెస్ కమిటీలను ప్రతిపాదించబోతున్నామని అన్నారు. ఈ కమిటీ అధ్యక్షులకు సంబంధించి జిల్లా కమిటీ అధ్యక్షులకు కనీసం ఐదు సంవత్సరాలు పార్టీలో కష్ట పని చేసిన వారై ఉండాలని, మండల కమిటీ అధ్యక్షులకు కనీసం మూడు సంవత్సరాలు పార్టీలో విధేయతగా ఉండాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాలకు చెందిన వారినీ 50 శాతానికి తగ్గకుండా అందరికీ సమన్యాయం చేయబోతున్నామని అన్నారు. ప్రజాస్వామ్యంలో యువత ఎంతో కీలకమని ఆనాడే రాజీవ్ గాంధీ 21 ఏళ్ల ఉన్న వయోజన ఓటు హక్కును 18 సంవత్సరాలకు మార్చిన ఘనత కాంగ్రెస్కు ఉందని నేడు అదే సిద్ధాంతాన్ని ఫాలో అవుతున్నామని అన్నారు సంస్థ గత బలోపేతంలో యువతకూ తగు ప్రాధాన్యత ఇవ్వబోతున్నట్లు తెలిపారు. 12వ తారీకు వరకు జిల్లాలోనే ఉంటానని ఎవరైనా తనని కలవడానికి వీలుగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయ తలుపులు ఎప్పుడు తెరిచి ఉంటాయని తెలిపారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త నాయకుడు సంస్థాగత బలోపే దానికి కృషి చేయాలని సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి,మహబూబాబాద్ ఇంచార్జి పోట్ల నాగేశ్వరరావు, ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గ ఇంచార్జి చక్కిలం రాజేశ్వరరావు, వైరా, సత్తుపల్లి నియోజకవర్గ ఇంచార్జి దైదా రవీందర్,అశ్వారావుపేట నియోజకవర్గ ఇంచార్జి పెసర మహిపాల్ రెడ్డి,సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ సభ్యులు శ్రీమతి మట్టా రాగమయి,ఖమ్మం సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావేద్, సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్ చౌదరి, టి పి సి సి ప్రధాన కార్యదర్శులు కట్ల రంగారావు,మద్దినేని బేబీ స్వర్ణ కుమారి, టి పి సి సి అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య సయ్యద్ గౌస్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్,పుచ్చకాయల వీరభద్రం, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు యడ్లపల్లి సంతోష్,జెర్రిపోతుల అంజనీ కుమార్,కార్పొరేటర్ మహ్మద్ రఫీదాబేగం ముస్తఫా తదితర నాయకులు పాల్గొన్నారు.

## భద్రాద్రి ఈవో రమాదేవిపై దాడి హేయమైన చర్య

### టీబీసీయూఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సీతారామ్, శ్రీనివాసరావు

మొదటి పేజీ తరువాయి

ఆలయ భూముల పరిరక్షణకు ఏపీ ప్రభుత్వం కూడా చొరవ చూపాలన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో భద్రాద్రి రాముడికి సుమారు 1,300 ఎకరాల భూమి ఉండగా అందులో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలోనే గరిష్ఠంగా 889.5 ఎకరాలు ఉందన్నారు. పురుషోత్తపట్నంలోని ఆలయ భూమి ఎక్కువ భాగం ఆక్రమణకు గురైందన్నారు. కోర్టు తీర్పు ప్రకారం ఈ భూమిపై దేవస్థానానికి హక్కులు లభించాయన్నారు. పురుషోత్తపట్నంలోకి ప్రవేశించే మార్గంలో పిల్లర్లతో నిర్మాణ పనులు చేపడుతుండగా ఆలయ సిబ్బంది మంగళవారం అక్కడికి చేరుకున్నారన్నారు. అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణం చేయవద్దని, ఇది పూర్తిగా రాముడి భూమి అని వివరించారు. కోర్టు తీర్పులతో దేవుడి పేరిట పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నాయని వెల్లడించారు. అయినప్పటికీ ఈవో అభ్యంతరాలు వినకుండా స్థానికులు రమాదేవిపై దాడి చేశారని ఇది హేయమైన చర్య అని తెలంగాణ బి సి ఉద్యోగుల సంఘం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు వంగర సీతారామ్, ప్రధాన కార్యదర్శి గజ్జెల్లి శ్రీనివాసరావు విమర్శించారు.

## బీసీలకు 42% రిజర్వేషన్లకు మంత్రివర్గ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

అందుబాటులో ఉన్న డేటా ఆధారంగా, జనాభా ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు తదుపరి చర్యలు చేపట్టాలని తీర్మానించింది.

బీసీల రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీలకు మండలం యూనిట్గా, ఎంపీపీ, జడ్పీటీసీలకు జిల్లా యూనిట్గా, జడ్పీ చైర్మన్లకు రాష్ట్రం యూనిట్గా పరిగణిస్తారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు అనుగుణంగా రాష్ట్రంలో అమల్లో ఉన్న పంచాయతీరాజ్ చట్టం–2018 సవరణలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. త్వరలోనే ఈ చట్టంలో చేయాల్సిన సవరణలకు అవసరమైన చర్యలు చేపడుతుంది.

రాష్ట్రంలో కొత్తగా రెండు ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. ఎయిమిటీ (AMITY) యూనివర్సిటీ, సెయింట్ మేరీ రిహాబిలిటేషన్ యూనివర్సిటీలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. AMITY యూనివర్సిటీలో మన తెలంగాణ విద్యార్థులకు, అంటే మన స్థానిక విద్యార్థులకు 50 శాతం అడ్మిషన్లకు అవకాశం కల్పించాలనే నిబంధనను ప్రభుత్వం విధించింది.

సంగారెడ్డి జిల్లాలో ఇటీవల రెండు కొత్త మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. కొత్తగా ఏర్పడ్డ జిన్నారం, ఇంద్రీశం మున్సిపాలిటీల పరిధిలో చేర్చే 18 గ్రామ పంచాయతీలను డీ లిస్టింగ్ చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో అధునాతనంగా గోశాలల ఏర్పాటు, నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. వచ్చే కేబినేట్ సమావేశంలోపు కమిటీ తమ నివేదికను అందించాలని గడువు విధించింది. ఇప్పటికే ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పశు సంవర్ధక శాఖ రూపొందించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ను, కొత్తగా నిర్మించే గోశాల డిజైన్లను మంత్రివర్గ భేటీలో ప్రదర్శించారు. రాష్ట్రంలో 306 గోశాలలున్నాయి. హైదరాబాద్లో ఎన్కేపల్లి, వెటర్నరీ యూనివర్సిటీ, వేములవాడ, యాదగిరిగుట్టలో అత్యాధునికంగా గోశాలలు నిర్మించాలని నిర్ణయించారు. వీటితో పాటు రాష్ట్రంలో ఉన్న గోశాలల రిజిస్ట్రేషన్లు, వాటి నిర్వహణపై సమగ్ర విధాన పత్రం రూపొందించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది.

కేబినెట్లో కొత్త సంప్రదాయం

ఈసారి రాష్ట్ర మంత్రివర్గం కేబినెట్ భేటీలకు సంబంధించి కొత్త సంప్రదాయాన్ని ప్రారంభించింది. ఇప్పటివరకు జరిగిన కేబినెట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, అమలుపై సమీక్ష జరిపింది. 2023 డిసెంబర్ 7వ తేదీ నుంచి ఇప్పటి వరకు 18 కేబినెట్ సమావేశాలు జరిగాయి. ఈరోజు 19వ సమావేశం జరిగింది. గతంలో జరిగిన సమావేశాల్లో మొత్తం 327 అంశాలను చర్చించింది. వీటిలో 321 అంశాలను కేబినెట్ ఆమోదించింది. వీటి అమలు పురోగతిని శాఖలవారీగా అధికారులతో మంత్రివర్గం చర్చించింది.

కొత్తగా 22 వేల ఉద్యోగాలు

ఈ ఏడాదిన్నర వ్యవధిలో రాష్ట్ర ప్రభుత్వం 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసింది. వీటితో పాటు మరో 17084 ఉద్యోగాల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉంది. కొత్తగా 22033 ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్లు ఇవ్వాలని మంత్రివర్గం చర్చించింది. వివిధ విభాగాల్లో పని చేస్తున్న ప్రతీ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల పనితీరును సమీక్షించేందుకు వీలుగా వారి ఆధార్, పూర్తి వివరాలు సేకరించాలని ఆర్థిక శాఖను మంత్రివర్గం ఆదేశించింది. ప్రభుత్వ ఉద్యోగుల హాజరుతో పాటు విధినిర్వహణలో జవాబుదారీతనం పెంచేందుకు అవసరమైన సంస్కరణలు తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఉద్యోగులకు సంబంధించి నియమించిన అధికారుల కమిటీకి ఈ బాధ్యత అప్పగించాలని నిర్ణయించారు. రెండు నెలల్లో పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని ఆదేశించింది.

## బీజేపీ నేతలు క్షమాపణ చెప్పాలి - కేటీఆర్ డిమాండ్

మొదటి పేజీ తరువాయి

అయితే మీ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు మా సాంస్కృతిక గుర్తింపుని అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేసేలా భారతదేశ చిత్రపటాన్ని ఉపయోగించారు. అయితే, మీ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు మాధవ్ బహుమతిగా ఇచ్చిన మ్యాపులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ని మాత్రమే చూపించడం దారుణం. తెలంగాణ రాష్ట్రం అస్తిత్వాన్ని లెక్కచేయకుండా చేసిన చర్య మమ్మల్ని తీవ్రంగా బాధించింది. ఇది పూర్తిగా అనుచితమైంది. భారతదేశ చిత్రపటం నుంచి మా చరిత్రనే తొలగిస్తే మేమెవరం? ఇది మీ పార్టీ అధికారిక అభిప్రాయమా? అని ప్రధానమంత్రి మోదీని కేటీఆర్ ప్రశ్నించారు. లేదా ఈ చర్య కేవలం ఒక పొరపాటా అనే విషయంపై మీరు వెంటనే ప్రధాని మోదీ స్పష్టత ఇవ్వాలి. ఇది తెలంగాణ ప్రజల త్యాగాలు, రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటాలను, బలిదానాలను అగౌరవపరచడమే కాకుండా మా చరిత్రను నిర్లక్ష్యం చేసిన బిజెపి నేతలు క్షమాపణ చెప్పాలి. పొరపాటైతే, తెలంగాణ ప్రజలని అపహాస్యం చేసినందుకు మీ పార్టీ నాయకత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## నాపై అర్బన్ నక్సలైట్ ముద్ర వేశారు..

### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ హాట్ కామెంట్స్

**న్యూస్ డెస్క్, 10 జులై (కెరటం న్యూస్):** ఆపరేషన్ కగార్కి వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడిన మరుసటి రోజు నుంచి నా పై అర్బన్ నక్సలైట్, దేశ ద్రోహి ముద్ర వేశారని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం సీపీఐ మఖ్దూమ్ కార్యాలయం రీ ఓపెనింగ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలుగు నేలపై జన్మించిన మఖ్దూమ్ జీవితాన్ని ప్రజలకు అంకితం చేశారని, మఖ్దూమ్కి సింగరేణి కార్మికులతో ఎనలేని బంధం ఉందని కొనియాడారు. మొదట మఖ్దూమ్ కార్యాలయం ఫౌండేషన్ స్టోన్ కి ( ఫిబ్రవరి 17, 1974) అప్పటి కాంగ్రెస్ మంత్రులు హాజరయ్యారని గుర్తుకు చేశారు. కాంగ్రెస్, కమ్యూనిస్టుల అనుబంధం విడదీయరానిదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ తో పాటు కమ్యూనిస్టులు బలపడాలని కోరుకున్న వ్యక్తుల్లో మొదటివాడిని, కమ్యూనిస్టు భావజాలానికి ఎప్పుడు మరణం లేదు. కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కొదవలేదని అన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టులతో జట్టుకట్టి విజయం సాధించామన్నారు. దేశంలో లౌకికవాదం గురించి మాట్లాడితే అర్బన్ నక్సల్స్ అవుతున్నాం. ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడితే దేశద్రోహులం అవుతున్నామని మండిపడ్డారు. ఆపరేషన్ కగార్తో కేంద్రం మారణకాండ కొనసాగిస్తోందని, ఇది బాధాకరం అని అన్నారు. మావోయిస్టులు చర్చకు సిద్ధమని ప్రకటించిన మానవత్వం కనికరము లేకుండా సీజ్ ఫైర్ చర్యకు పూనుకున్నారని ఆరోపించారు. ఆపరేషన్ కగార్ పేరుతో అటవీ ఖనిజ సంపదను కార్పొరేట్స్కి దోచిపెట్టే ప్రయత్నం కేంద్రం చేస్తోందని ఆరోపించారు. దేశం భవిష్యత్ కోసం లౌకిక వాద శక్తులు బలపడాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేశంలో ఎలక్షన్ కమిషన్ కొందరు వ్యక్తులకు లాభం చేసే సంస్థగా మారడం దౌర్భాగ్యం.. ఈ పరిణామం శ్రేయస్కరం కాదు.. అని ఆరోపణలు చేశారు.

## అందరితో కలిస్తేనే రాజకీయాల్లో పనికి వస్తారు

మొదటి పేజీ తరువాయి

తమ పార్టీ సింబల్ కమలం అని, అది కూడా బురదలోనే ఉంటుందని అన్నారు. కానీ బురద అంటించుకోదని చెప్పుకొచ్చారు. ఎవరితోనూ కలవం అంటే కుదరదని అన్నారు. ఇలాంటి వారు దేశ సేవ కోసం ఎన్జీవోలో చేరొచ్చని అన్నారు. వికారాబాద్ జిల్లాలో మూడు గ్రూపులు ఉండేవన్నారు. పార్టీలో గ్రూప్స్ చేసేటోళ్లను సహించబోనని చెప్పారు. అలాంటి వారు తనకు పార్టీకి అవసరం లేదని చెప్పుకొచ్చారు. తన కన్నా చిన్నవాళ్లు ఉంటే గట్టిగా చెప్తానని, పెద్దోళ్లయితే రిక్వెస్ట్ చేస్తానని అన్నారు. పార్టీకి విరుద్ధంగా మాట్లాడేవారిని ఉపేక్షించేది లేదన్నారు. పార్టీ కింది నుంచి నిర్మాణం జరగాలి అంటే అందరితో కలవాలని అన్నారు. ఒక ఎంపీ గెలిస్తే పార్టీ అభివృద్ధి చెందినట్టు కాదని, అధికారంలోకి రావడమే ముఖ్యమని చెప్పారు. భారతదేశంలోకి 4 కోట్ల మంది రోహింగ్యాలు అక్రమంగా చొరబడ్డారని, ఇందులో 20 లక్షల మంది వరకు తెలంగాణలోనే ఉంటారని అన్నారు. దేశంలో వరి ఉత్పత్తి బాగా పెరిగిందని, తెలంగాణలో వానలు, యూరియా వల్ల దిగుబడి పెరిగిందని అన్నారు. ఇలాంటి యూరియా వరిని ఎంకరేజ్ చేయొద్దని చెప్పారు. రాష్ట్ర జనాభాకు 45 లక్షల టన్నుల వరి అవసరమైతే.. 2 కోట్ల టన్నుల వరి పండిస్తున్నామని చెప్పుకొచ్చారు. మిల్లెట్స్ ఎక్కువగా పండించాలని కోరారు. ఫాతిమా కాలేజీ భవనం కూల్చివేత అంశంపై మాట్లాడుతూ... పేద హిందువులే టార్గెట్గా హైడ్రా పనిచేస్తోందని చెప్పారు. ఎంఐఎం జోలికి పోయే సత్తా హైడ్రాకు లేదన్నారు.

## బీజేపీ అసమర్థ పాలన వల్లే ప్రమాదాలు

### : మల్లికార్జున ఖర్గే



**న్యూస్ డెస్క్, 10 జులై (కెరటం న్యూస్):** ప్రభుత్వ ఉదాసీనత ఇలాగే కొనసాగితే సమయం వచ్చినపుడు ప్రజలే తగిన గుణపాఠ చెబుతారని ఖర్గె సోషల్ మీడియా ఎక్స్లో పోస్ట్ చేశారు. బుధవారం గుజరాత్లోని వడోదర జిల్లాలోని గంభీర వంతెనలో ప్రధాన భాగం కూలిపోవడంతో కొందరు చనిపోయారు. గత నెలలో అహ్మదాబాద్లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 240 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఖర్గే వరుస ప్రమాద ఘటనలపై స్పందించారు. దేశంలో ప్రమాదాలు సర్వసాధారణంగా మారిపోయాయి. రైలు ప్రమాదాలు, వంతెనలు కూలిపోవడం, విమాన ప్రమాదాలు ఇలా వరుసగా ప్రజల్లో బీజేపీ పాలన అంటే భయం పెరుగుతోంది. తాజాగా వంతెన కూలిన ఘటన గురించి తెలియగానే దిగ్భ్రాంతికి గురయ్యాయి. 12 మంది వరకు చనిపోవడం విషాదం. ప్రమాదానికి మూడేళ్ల నుంచే వంతెన పరిస్థితి దారుణంగా ఉందని, మరమ్మతులు చేయాలని చెప్పినప్పటికీ, చర్యలు తీసుకోలేదు. 2021 నుంచి ఇప్పటివరకు గుజరాత్లో ఏడు వంతెన ప్రమాదాలు చోటుచేసుకున్నాయని ఖర్గె పోస్ట్లో పేర్కొన్నారు.

పెరిగిన మృతుల సంఖ్య

గుజరాత్లోని వడోదరలో వంతెన కూలి వాహనాలు నదిలో పడిపోయిన ఘటనలో మృతుల సంఖ్య పెరిగింది. గురువారం మరో నలుగురి మృతదేహాలు లభ్యం కావడంతో మృతుల సంఖ్య 15కు చేరిందని అధికారులు వెల్లడించారు. ఇంకా మరో నలుగురి ఆచూకీ దొరకాల్సి ఉంది. గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఎన్డీఆర్ఎఫ్ వెల్లడించింది.

## కసాయి కొడుకు, బిడ్డ అనే వార్తలే.. వాటిని చూస్తే ప్రాణం కలుక్కుమంటోంది: ఈటల హాట్ కామెంట్స్

మొదటి పేజీ తరువాయి

వినకూడని కనకూడని సంఘటనలు అనేకం జరుగుతున్నాయని, వాటిని చూసి ప్రాణం కలుక్కుమంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగుడికి డబ్బులు ఇవ్వలేదని జన్మనిచ్చిన తల్లిని చంపుతున్నారని, మందలించిన ఖర్మానికి తండ్రిని చంపే వారిని కూడా చూస్తున్నామని, కసాయి కొడుకు, కసాయి బిడ్డ అనే వార్తలు చూస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఆడపిల్లలు కూడా తండ్రులను చంపుతున్న సంఘటనలు ఈ మధ్య కనిపిస్తున్నాయని అన్నారు. ఇది కలియుగమని బాధపడాలా ? గొప్ప సంస్కృతి ఉన్న మనం అసహ్యించుకునే విధంగా మారుతున్నామా ? అని ప్రశ్నించారు.

ఈ గురు పరంపర, మన సంస్కృతి సాంప్రదాయాలను సమున్నతంగా, సంపూర్ణంగా నిలుపుకోకపోతే మరింత వికృతచేష్టలతో మానవ జీవితాలు కలంకమయ్యే పద్ధతిలో, అసహ్యించుకునే పద్ధతిలో మారుతుందని అన్నారు. ఈ సమాజానికి పట్టిన టెన్షన్ వదిలించాలంటే ప్రతి ఒక్కరు స్పందించాలని, రాజకీయ వ్యవస్థ కూడా దీనికి బాధ్యత వహించాలని కోరారు. ఇంజనీర్ ఫెయిల్ అయితే బ్రిడ్జి కూలిపోతుంది కానీ ఒక రాజకీయ నాయకుడు ఫెయిల్ అయితే సమాజం కూలిపోతుందని అభిప్రాయపడ్డారు. రాజకీయ నాయకున్ని సమాజంలో చిన్న చూపు చూడకండి.. రాజకీయ నాయకుడు సమాజాన్ని నడిపే గురువు లాంటివాడు. ఆయన సన్మార్గంలో నడిచినప్పుడు మాత్రమే సమాజం చల్లగా ఉంటుంది. ఆ రాజకీయ నాయకున్ని ఎన్నుకునే విషయంలో కూడా అలర్ట్ గా ఉండాలని కోరారు.

## ఆంధ్ర- తెలంగాణ సెంటిమెంట్ను మళ్ళీ తెర మీదకు తెచ్చేందుకు కుట్ర : ఎంపీ చామల

మొదటి పేజీ తరువాయి



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ మిగులు బడ్జెట్ తో అధికారంలోకి వచ్చి రూ. 8 లక్షల కోట్ల అప్పు చేశాడని విమర్శించారు. తెచ్చిన అప్పును సక్రమంగా వినియోగించుంటే రాష్ట్రం ఎప్పుడో అభివృద్ధి చెందేదన్నారు.

గత ప్రభుత్వం ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్ లకే పరిమితమైందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 60000 ఉద్యోగాలు ఇచ్చామన్నారు. బనకచర్ల బంకను మనకు రుద్దుదామని ప్రయత్నం చేస్తున్నారని, ఆరు నూరైనా బనకచర్ల ప్రాజెక్టును కానివ్వబోమన్నారు. కేటీఆర్ కేవలం ఒక ఎమ్మెల్యే అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థాయి కేటీఆర్ ది కాదన్నారు. కేసీఆర్ ను చర్చకు సిద్ధం చేయాలని కేటీఆర్ కు సూచించారు. తెలంగాణ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయిన కేసీఆర్ మొదటి అపెక్స్ కమిటీ లోనే మనకు రావలసిన నీళ్లపై కొట్లాడవలసి ఉంటే ఈ సమస్య ఉండేది కాదన్నారు. కృష్ణాజిల్లాలో తెలంగాణకు రావలసిన 299 టీఎంసీలను 10 సంవత్సరాల టీఆర్ఎస్ పాలనలో ఎప్పుడు వాడుకోలేదన్నారు.

తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంవత్సరము 280 టీఎంసీలను వాడుకున్నామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు వలన ఉత్తర తెలంగాణకు తప్ప దక్షిణ తెలంగాణకు లాభం లేదని, కాంగ్రెస్ పార్టీ హయాంలో సగం పూర్తయిన ఎస్ఎల్బీసీ, రంగారెడ్డి టన్నెల్సు 6000 కోట్ల ఖర్చు చేస్తే లక్షల ఎకరాలు సాగునీరుకు అందుబాటులోకి వచ్చేదన్నారు. కేటీఆర్ ఒక ఎమ్మెల్యే అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థాయి కాదని, చాలెంజ్ చేయాలంటే ప్రతిపక్ష నాయకుడు అయిన కేసీఆర్ చేయాలి కానీ కేటీఆర్ కాదన్నారు. కేటీఆర్ కు దమ్ముంటే కేసీఆర్ దగ్గర నుంచి ప్రతిపక్ష హోదా తెచ్చుకొని చాలెంజ్ చేయాలని సూచించారు. కేసీఆర్ రెండు లక్షల కోట్లు ఖర్చు చేసి గోదావరికి జలాలు 948 టీఎంసీలు కాపాడుకోలేకపోయాడని విమర్శించారు.

# ఖమ్మంలో ముగ్గురు మంత్రులు ఉండి జిల్లాకు ఒరిగిందేమిటి?

**ఖమ్మం బ్యూరో, 10 జులై (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన పెండింగ్ ఫీజురీయంబర్స్ మెంట్స్, స్కాలర్ షిప్స్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ధర్నా కంటే ముందు విద్యార్థి మహా ప్రదర్శన నిర్వహించి కలెక్టరేట్ ఎదుట బైఠాయించి మా స్కాలర్ షిప్స్ మాకు ఇవ్వాలి, స్కాలర్ షిప్స్ బిక్ష కాదు మా హక్కు అంటూ నినాదించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు “పోనుకుల సుధాకర్” అధ్యక్షన జరిగిన మహా ధర్నాలో ఎస్ఎఫ్ఐ “రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ నాగరాజు” మాట్లాడుతూ రాష్ట్రంలో పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2004 లో ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని నాటి ప్రభుత్వం తీసుకుని వచ్చింది. ప్రభుత్వమే సామాజికంగా, ఆర్థికంగా వెనుక బడిన వర్గాల విద్యార్థులకు డిగ్రీ మరియు ప్రొఫెషనల్ కోర్సులు, యూనివర్సిటీ విద్య చదువుతున్న విద్యార్యులకు ఈ ఫీజును చెల్లిస్తుంది. తెలంగాణ రాష్ట్రంగా విభజన చెందినా తర్వాత ఏర్పడిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని మార్చాలని చూసింది. విద్యార్థుల ఉద్యమించటంతో వెనక్కు తీసుకుంది. 2014 నుండి 2018 వరకు ఫీజులు చెల్లించిన బి ఆర్ ఎస్ ప్రభుత్వం 2019- 20 విద్యాసంవత్సరం కొంత బకాయిలను ఉంచింది. అప్పటి నుండి రాష్ట్రంలో 2024 వరకు సుమారు 5358 కోట్ల స్కాలర్ షిప్స్ మరియు ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు ఇతర స్కీం లకు వాడుకుంది. విద్యార్థులకు ఒక్క పైసా చెల్లించకుండా వారి చదువుల నుండి మధ్యలోనే డ్రాప్ అయ్యే చర్యలకు పూనుకుంది. బిఆర్ఎస్ పాలనలో ఫీజు బకాయిలు ఇవ్వలేదని, ఈ పథకాన్ని తీసుకుని



వచ్చింది మా కాంగ్రెస్ అని మేం అధికారంలోకి వస్తే ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తామని, మరింత అభివృద్ధి చేసి అందరికి బకాయిలు లేకుండా ఇస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టో లో హామీని ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఫీజుల బకాయిలు చెల్లించలేదు. పైగా ఆర్థిక పరిస్థితి బాగా లేదని బుకాయిస్తుంది. ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ పథకానికి సవరణలు చేసి ముందు విద్యార్థుల డబ్బులు పెట్టి చదువుకోవాలని తర్వాత మేము ఫీజు రీయింబర్స్ చేస్తామని వాదిస్తోంది. ఈ పథకం కింద రాష్ట్రంలో 13 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈ డబ్ల్యూ ఎస్ విద్యార్థులు చదువుతున్నారు. వారికి గత ప్రభుత్వాల బకాయి, కాంగ్రెస్ ఇవ్వాల్సిన నిధులు కలిపి 8,158 కోట్లు నిధులు ఇవ్వాలి. ప్రైవేట్



కళాశాలలు, విద్యాసంస్థలు విద్యార్థులకు ఫీజులు ప్రభుత్వం ఇవ్వడం లేదని పేరుతో విద్యార్థుల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారు. తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారు. విద్యార్థుల ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలు నిర్వహిస్తామని చెప్పి యూనివర్సిటీలో పరీక్షలు బంద్ చేసి మరీ నిరసనలు చేశారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ హాస్టళ్లు మూత పడ్డాయి. ఉస్మానియా, కాకతీయ లాంటి రాష్ట్ర యూనివర్సిటీలు, చివరకు సెంట్రల్ యూనివర్సిటీలో చదివే విద్యార్థులు కూడా తమ చదువులను మధ్యలో డ్రాప్ చేస్తున్నారు. ముందు విద్యార్థులు కట్టాలని తర్వాత విద్యార్థి అకౌంట్ లో నిధులు వేస్తామని పేరుతో నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం తప్పుకుంటుంది. విద్యార్థులు తమ ఫీజులు విడుదల చేయాలని నిరసనలు చేస్తున్నారు. రోడ్ల పైకి వస్తున్నారు. హక్కులు అడుగుతున్న విద్యార్థుల పై పోలీసులు అరెస్టు చేసి కేసులు పెడుతున్నారు. వేలాది మంది విద్యార్థులు రోడ్లపైకి వచ్చి తమ ఫీజులను ఇవ్వాలనీ పోరాడుతున్నారు. అయినా ప్రభుత్వం విద్యార్థులుగోడును వినడంలేదు. ప్రత్యర్థులను సన్యాసులు, దద్దమ్మలు అని. తిట్టె రేవంత్ రెడ్డి ఫీజులు ఇవ్వకుండా దద్దమ్మ అయ్యారని ఫీజులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు బకాయిలు ఇవ్వమంటే ఆర్థిక పరిస్థితులు బాగాలేదని. చెప్పిన ముఖ్యమంత్రి మరి ఎమ్మెల్యేలు, మంత్రులకు జీతాలకు డబ్బులు ఏలా వస్తున్నాయని ఆరోపించారు. తక్షణమే ఫీజులు విడుదల చేయకుంటే “ ఛలో హైదరాబాద్” కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

### ముగ్గురు మంత్రులు ఉండి ఉపయోగం లేదు..
### ఎస్ఎఫ్ఐ జిల్లాకార్యదర్శి తుడుం ప్రవీణ్

ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు ఉండి కూడా ఈ జిల్లాకు చేసిందేమి లేదని విద్యార్థులు ఫీజులు ఇవ్వాల్సిన భాద్యత తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ అన్నారు. ఫీజులు విడుదల చేయకుండా వ్యవరిస్తే జిల్లాలో మంత్రులను ఏక్కడకక్కడ అడ్డుకుంటామని తెలిపారు. విద్యార్థులు అంతకు ముందు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.రాజు, జిల్లా సహాయ కార్యదర్శి డి.వెంకటేష్, జిల్లా నాయకులు వరుణ్, హారిష్, మణికంఠ,వినోద్, సుశాంత్, సాయికుమార్, ప్రేమ్ కుమార్, సుకన్య, ప్రవళిక, భాను, త్రినాథ్,మనోజ్, శశాంక్, సాయి, కార్తీక్,నవీన్, సాత్విక, శ్రీలత, నవ్య ,భవాని, రమ్య తదితరులు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన - మాజీ ఎంపీ నామ



**ఖమ్మం బ్యూరో, 10 జులై (కెరటం న్యూస్):** బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు గురు పౌర్ణమి సందర్భంగా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. తల్లిదండ్రుల తర్వాత గురువు స్థానమే అత్యున్నతమని, మనకు బుద్ధి, జ్ఞానం ఇచ్చే వారు గురువులేనని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతిలో గురువు పాత్ర ఎంతో గొప్పదన్నారు. బాల్యంలో మన లక్ష్యాన్ని ఏర్పరచడంలో, జీవన మార్గాన్ని చూపడంలో గురువు పాత్ర అమోఘమైనదని గుర్తుచేశారు. మంచి పౌరులుగా ఎదిగేందుకు, నైతిక విలువలు అలవాటుకు గురువులు మార్గదర్శకులవుతారని తెలిపారు. విద్యార్థులు తమ గురువుల పట్ల గౌరవంతో ఉండాలని, వారి మార్గదర్శకత్వాన్ని పాటించాలన్నారు. గురుపౌర్ణమి రోజున ప్రతి ఒక్కరూ తమకు జ్ఞానం ఇచ్చిన ఉపాధ్యాయులను స్మరించుకోవాలని, వారికి కృతజ్ఞతలు తెలపాలని అన్నారు. ప్రస్తుత కాలంలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నైతిక బోధన అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. వారిని గౌరవించడమే మన సంస్కృతికి నిదర్శనమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయ సంక్షేమం పట్ల మరింత శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ గురు పౌర్ణమి రోజున మనకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను స్మరించుకోవాలని, వారి ఆశీర్వాదాలతోనే విజయ మార్గంలో ముందుకు సాగాలని నామ ఆకాంక్షించారు.

# రేగా కు మాతృవియోగం - మాజీ ఎంపీ నామ సంతాపం



**ఖమ్మం బ్యూరో, 10 జులై (కెరటం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, పినపాక మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ మాజీ విప్ రేగా కాంతారావు మాతృమూర్తి నర్సమ్మ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమె మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. రేగా మాతృమూర్తి మృతి విషయం తెలిసి దిగ్భ్రాంతి చెందానన్నారు. రేగా కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. నర్సమ్మ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ రేగా కుటుంబ సభ్యులకు నామ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఎంపీ వద్దిరాజుకు విశాఖ శ్రీశారదా పీఠాధిపతుల ఆశీస్సులు



**హైదరాబాద్ బ్యూరో, 10 జులై (కెరటం న్యూస్):** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర విశాఖ శ్రీశారదా పీఠం పూజ్యశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఆషాఢ శుద్ధ పౌర్ణమి (గురుపౌర్ణమి) సందర్భంగా గురువారం రాత్రి ఎంపీ రవిచంద్ర హైదరాబాద్ చందానగర్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ సముదాయంలో చాతుర్మాస్య దీక్షలో ఉన్న శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి వారిని కలుసుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. అలాగే, ఎంపీ రవిచంద్ర శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకుని తన గోత్ర నామంతో ప్రత్యేక పూజలు చేశారు, వేద పండితులు ఆయన్ను శాలువాతో సత్కరించి, ఆశీర్వచనాలు పలికారు. శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర మహాస్వామి వారు,శ్రీశారదా పీఠం ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ స్వాత్మానేంద్ర సరస్వతీ స్వాములు ఎంపీ వద్దిరాజుకు తమ ఆశీస్సులు అందజేశారు.



# గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబాకు 108 లీటర్లతో పాలాభిషేకం

### పూజా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు



**పాల్వంచ, 10 జులై (కెరటం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ శిరిడి సాయిబాబా మందిరం లో గురు పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా పూజ నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రోహిత్ శర్మ మాట్లాడుతూ గురువారం తెల్లవారుజాము నుంచి ఆలయంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించి సాయిబాబాకు 108 లీటర్లతో పాలాభిషేకం నిర్వహించామని తెలిపారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎరుకల వెంకటేశ్వర్లు, మరియు కమిటీ సభ్యులు వల్లపు యాకయ్య, మిరియాల కమలాకర్, బంగారు శ్యామ్, వలసాల సాయి, ప్రసాద్, దొంతర పోయిన అశోక్, కొత్త వెంకట్ రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ వద్దిరాజు



**ఖమ్మం బ్యూరో, 10 జులై (కెరటం న్యూస్):** అనారోగ్యం పాలై ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన బాధితులకు తన సిఫారసు మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర గురువారం పంపిణీ చేశారు. బుర్హాన్ పురంలోని తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 13 మంది బాధితులకు వీటిని అందజేశారు. అనంతరం ఆయన చెక్కులు పొందిన లబ్ధిదారులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేసి, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శీలంశెట్టి వీరభద్రం, తోట రామారావు, బీఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటరమణ, పగడాల నరేందర్, నేలకొండపల్లి మండలం రాజారాంపేట సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వంశీచంద్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ మహిళా నాయకులు





**ఖమ్మం టౌన్, 10 జులై (కెరటం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్చార్జిగా నియమితులై తొలిసారి ఖమ్మం వచ్చిన వంశీచంద్ రెడ్డి ని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కస్తూరి తిలకం దిద్ది శాలువాతో ఘనస్వాగతని కాంగ్రెస్ ఆడబిడ్డ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మహిళలు కొర్లపాటి అన్నపూర్ణ, గన్నోజు గోవిందమ్మ , ప్రతిభ రెడ్డి, భార్గవి, చంద్రిక, సుకన్య లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు.

# నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాల పై చర్యలు తీసుకోవాలి



**గార్ల, 10 జులై (కెరటం న్యూస్):** గార్ల మండల కేంద్రంలోని నిర్మల ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థి తండ్రి సిలివేరు హరిబాబు స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐకి,మండల విద్యాశాఖ అధికారికి,జిల్లా విద్యాశాఖ అధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు. సాయిబాబా గుడి బజారుకు చెందిన సిలివేరు హరిబాబు కుమారుడు రోహన్ స్థానిక నిర్మల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడని జులై 7న స్కూలుకి వెళ్లి కిందపడి దవడకు దెబ్బ తగిలి రక్తం కారుచున్న యాజమాన్యం స్పందించలేదని తన భార్య వచ్చి రోహన్ ను హాస్పిటల్ కు తీసుకెళ్లి ట్రీట్మెంట్ చేయించి వరకు నిర్మల హైస్కూల్ యాజమాన్యం స్పందించలేదని ఆయన ఆరోపించారు.తన కుమారుడికి ఎలా దెబ్బ తగిలిందని అడగగా ఆ స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ తన స్కూల్లో 700 మంది విద్యార్థులకు ఒక్కడే పీఈటి ఉన్నాడని ఎంతమందిని చూసుకోవాలని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం విడ్డూరంగా ఉందని అసహనం వ్యక్తం చేశారు.స్థానిక తల్లిదండ్రులు నిర్మల హై స్కూల్ యాజమాన్యంపై పలు ఆరోపణలు చేస్తున్నా సరే విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విద్యార్థుల భద్రత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నిర్మల పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆయిల్ పామ్ తోనే అధిక లాభాలు

### ఉద్యాన అధికారి శ్రావణి



వేంసూరు, 10 జులై (కెరటం న్యూస్): వేంసూర్ మండలం కొత్తూరు గ్రామం లో మండల ఉద్యాన అధికారి శ్రావణి రైతులతో నిర్వహించిన అవగాహన సదస్సు లో ఆయిల్ పామ్ సాగుతోనే అధిక లాభాలు సాధించవచ్చు అని పేర్కొన్నారు. మొదటి మూడు సంవత్సరాల పాటు కంది, వేరు శెనగ, కూరగాయ పంటలు, నువ్వులు వంటి పంటలు వేసుకోవచ్చు. ఆయిల్ పామ్ పంటకు ఇబ్బంది కలగకుండా మొక్క చుట్టూ పాదు చేసి వరుసల మధ్యలో అంతర పంటలు చేస్కోవాలి. మొక్క కొమ్మలు నరకటం చెట్టు మొదట్లో కట్టడం వంటివి చేయరాదు. ఎరువులు మరియు నీటి యాజమాన్యం పాటించాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి బోరాన్ మరియు మెగ్నీషియం మొక్కలకు వేసుకోవాలి.అంతే కాక ఉద్యాన శాఖ తరుపున అందిస్తున్న ఇతర రాయితీలు వినియోగించు కోవాలని మిద్దె పథకం కింద కూరగాయలకు ఉన్న రాయితీ వినియోగించుకుని కూరగాయల పంటలు సాగు పెంచాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి మరియు రైతులు పాల్గొన్నారు